క్లుప్తంగా

ఉచిత కంప్యూటర్, టైలరింగ్ శిక్షణ




టైలరింగ్ శిక్షణ ఇస్తున్న సిబ్బంది

దెందులూరు: గ్రామీణ శివారు ప్రాంతాల్లో మహిళలు నిరుద్యోగ యువతీ యువకులకు స్వయంగా ఎదిగేందుకు మండలంలోని గోపన్నపాలెం గ్రామ పరిధిలోని సెయింట్ ఫ్రాన్సిస్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ద్వారా అడ్మిషన్ ఫీజు చెల్లిస్తే ఉచితంగా రెండు నెలల పాటు కంప్యూటర్, టైలరింగ్, జిగ్ జాగ్ లాంటి విభాగాల్లో ఉచితంగా శిక్షణనిస్తామని సెయింట్ ఫ్రాన్సిస్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ కరస్పాండెంట్ బ్రదర్ జోసెఫ్ కుమార్ తెలిపారు. ఈ ట్రైనింగ్ సెంటర్‌ను గోపన్నపాలెంతో పాటు శివారు గ్రామాల ప్రజలందరూ నిరుద్యోగ యువత వివాహిత మహిళలు సైతం సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని బ్రదర్ జోసెఫ్ కుమార్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్య వైద్యం మౌలిక వసతులు కల్పన, ఆధ్యాత్మికంగా అభివృద్ధికి సెయింట్ ఫ్రాన్సిస్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

భీమడోలు: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి యువత నడుం బిగించాలని రాష్ట్ర పీసీసీ ప్రధాన కార్యదర్శి, జిల్లా ఎన్నికల పరిశీలకులు వింత సంజీవరెడ్డి అన్నారు. భీమడోలులో శుక్రవారం ఉంగుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యర్రంశెట్టి ఏడుకొండలు అధ్యక్షత వహించారు. ఉంగుటూరు నియోజకవర్గ నూతన కార్యవర్గం ఎంపిక, పార్టీ పటిష్టత అంశాలపై చర్చించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వింత సంజీవరెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యర్రంశెట్టి ఏడుకొండలు, నిడదవోలు నియోజకవర్గ అధ్యక్షుడు పెద్దిరెడ్డి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత



దెందులూరు మాజీ ఏఎంసీ చైర్మన్ అప్పనప్రసాద్

దెందులూరు: కూటమి ప్రభుత్వానిది మంచి ప్రభుత్వామా.. చెడ్డ ప్రభుత్వామా అని చెప్పాల్సింది ప్రజలేగాని సచివాలయ ఉద్యోగులు కాదు కదా అని దెందులూరు మాజీ ఏఎంసీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత అప్పనప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కొన్ని రోజులుగా కూటమి ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులతో స్టిక్కర్లు ఇచ్చి ఇంటింటికీ వెళ్లి అతికించాలని ఒత్తిడి చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వ వైఫల్యం చెందిందని అన్నారు. చంద్రబాబు కేవలం పదవే పరమావధిగా ఆచరణ సాధ్యం కాని పథకాలను సూపర్ సిక్స్ పేరిట ఊరువాడా హామీలిచ్చి నేడు చేతులెత్తేశారని విమర్శించారు. ఆడబిడ్డకు నెలకు రూ.1,500లు, నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేలు, అన్నదాతకు భరోసా ఇలా సూపర్ సిక్స్‌లో ఉన్న ఏ ఒక్క హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను దారి మళ్లించేందుకు లడ్డూ వివాదాన్ని చంద్రబాబు సృష్టించడం దుర్మార్గమన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన వృద్ధులు, వికలాంగులు, వితంతువుల పెన్షన్లను టీడీపీ నాయకులు సచివాల య ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చి నాలుగు నెలలుగా నిలుపుదల చేయడం దుర్మార్గమన్నారు. ప్రజావ్యతిరేకత నాలుగు నెలల్లోనే ఈ స్థాయిలో రావడంపై కూటమి నేతల వెన్నుల్లో వణుకు ప్రారంభమైందన్నారు. సనాతన ధర్మంపై ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని అప్పన ప్రసాద్ అన్నారు. ఎన్నికలకు ముందు తప్పు జరిగితే ప్రశ్నిస్తా... ప్రశ్నించడానికే జనసేన అన్న పవన్‌కల్యాణ్ చంద్రబాబుతో కలిసి మేనిఫెస్టో విడుదల చేసిన తరువాత సూపర్ సిక్స్ పథకాల అమలుపై ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు.

6 నుంచి ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 1938 ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభల పోస్టర్లను, ఆహ్వాన పత్రాలను ఏలూ రు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం శుక్రవారం ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. విద్యా వైజ్ఞానిక మహాసభల్లో విద్యా రంగం అభివృద్ధికి తీర్మానాలు చేస్తారని, అందుకు ఈ మహాసభలు ఉపయోగపడాలని కోరారు. రాష్ట్ర అకడమిక్ కమిటీ కన్వీనర్ జి.కృష్ణ మాట్లాడుతూ విజయనగరంలో జగన్నాథ కల్యాణ మండపం పుల్‌బాగ్ రోడ్డులో ఈనెల 6,7,8 తేదీల్లో నిర్వహించనున్న 20వ విద్యా, వైజ్ఞానిక మహాసభలు, 80 వసంతాల ఓక్ జూబ్లీ వేడుకలను విజయవంతం చేయాలన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రత్నం బాబు, జీ. మోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు డి. శ్రీనివాసరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు తీర్పు చంద్రబాబుకు చెంపపెట్టు



ఉంగుటూరు: వైఎస్ జగన్‌ను హిందూ వ్యతిరేకిగా చిత్రీకరిస్తూ లడ్డూ వ్యవహారంలో లబ్ధిపొందాలని చేసిన ప్రయత్నంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వైఫల్యం చెందాడు. దీనిపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టు వంటిదని పలువురు అభిప్రాయపడుతున్నారు. లడ్డూ తయారీలో కల్తీపై ఎటువంటి ఆధారాలు లేవని కోర్టు స్పష్టం చేసింది. ఓవైపు తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో చెప్పినా వినకుండా జగన్‌పై బురద చల్లాలని చంద్రబాబు చేసిన ప్రయత్నాన్ని వ్యతిరేకిస్తూ కోర్టు మొట్టికాయలు వేసింది. హిందువుల మనోభావాలను దెబ్బతినేలా వ్యవహరించడం సరికాదని, ఆమాత్రం తెలియదా ప్రభుత్వం పెద్దలకు అని కోర్టు అభిప్రాయ పడింది. ప్రభుత్వం సూపర్ సిక్స్ అని ఊదరకొట్టి అధికారం చేజిక్కించుకున్న అనంతరం చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చడాన్ని విస్మరించి ఈ రకమైన చౌకబారు విమర్శలు దిగడం సరికాదని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ప్రతిపక్షాల నోరు నొక్కేయడానికి చంద్రబాబు అసత్యాలను ప్రచారం చేస్తున్నారని ప్రజలు అంటున్నారు. అధికార పక్షం నాయకులకు సైతం చంద్రబాబు నాయుడు తీరు రుచించడం లేదు. చంద్రబాబు ఇచ్చిన హామీలు ఎలా నెరవేర్చాలో ఆలోచించడం మానేసి ప్రపంచ వ్యాప్తంగా హిందువుల ఇష్టదైవమైన వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రసాదం లడ్డూను కేంద్రంగా రాజకీయాలు చేయడంపై అధికార పక్ష నాయకులు, తటస్థులు సైతం తలలు పట్టుకుంటున్నారు.

చంద్రబాబు కుట్ర విఫలమైంది



అధికార తెలుగుదేశం కూటమి ప్రభుత్వానికి సహనం లేదని తేలింది. జగన్ హిందూ వ్యతిరేకి అని చిత్రీకరించేందుకు చేసిన కుట్ర విఫలమైంది. లడ్డూలో కల్తీ జరిగిందంటూ అసత్యాలను తెరమీదకు తీసుకువచ్చారు. సుప్రీంకోర్టు వ్యాఖ్యలు చంద్రబాబుకు చెంపపెట్టు. ఎటువంటి ఆధారాలు లేకుండా ప్రభుత్వంలో ఉండే పెద్దలు ఈ రకంగా చౌకబారు విమర్శలకు దిగడం, హిందువుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించడం సరైన పద్ధతి కాదు. తన పాలనాపరమైన వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకు, ప్రజలను డైవర్ట్ చేయడానికి చంద్రబాబు చేసిన కుట్ర సుప్రీంకోర్టు జోక్యంతో విఫలమయ్యింది.

– యెలిశెట్టి పాపారావు బాబ్జి, సొసైటీ మాజీ అధ్యక్షుడు, చేబ్రోలు

మహాప్రసాదాన్ని రాజకీయంగా వాడకూడదు



ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువులు మహాప్రసాదంగా భావించే తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూను రాజకీయంగా వాడుకోవడం మంచి విధానం కాదు. సుప్రీంకోర్టు వ్యాఖ్యలు చంద్రబాబుకు చెంపపెట్టు వంటిది.రోజురోజుకూ రాజకీయాలు మితిమీరిపోతున్నాయి. ప్రజల మనోభావాలను పరిగణలోకి తీసుకోకుండా రాజకీయ నాయకులు వ్యవహరిస్తున్నారు. ఇలాంటి విధానాలు దేశ భవిష్యత్తుకు ప్రమాదకరంగా మారుతాయి.

– కలిగొట్ల శ్రీరామకృష్ణ, రిటైర్డు టీచరు

జెడ్పీ పనుల పురోగతిని సమీక్షించండి

పెదపాడు: జెడ్పీ నిధులతో మంజూరైన పనుల ప్రగతిని సమీక్షించాలని ఉమ్మడి జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు ఎంపీడీవోగా విధుల్లో చేరిన మహ్మద్ అమీలు జామా మండలంలోని సత్యవోలులోని క్యాంపు కార్యాలయంలో చైర్‌పర్సన్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పెదపాడు మండలంలో జిల్లాపరిషత్ నిధులతో మంజూరైన పనుల పురోగతిని తెలుసుకుని ప్రారంభమయ్యేలా చూడాలని చైర్‌పర్సన్ అన్నారు.

నిందితులను అరెస్టు చేయాలి

దెందులూరు: జంగారెడ్డిగూడెం బస్టాండ్ ఎదురుగా ఉన్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం చూపుడు వేలు విరగగొట్టిన నిందితులను 48 గంటల్లో అరెస్టు చేయాలని జిల్లా దళిత సంఘా జేఏసీ నూకపెయ్యి కార్తీక్ డిమాండ్ చేశారు. నిందితులను త్వరితగతిన గుర్తించి అరెస్టు చేయనిపక్షంలో చలో జంగారెడ్డిగూడెంకు పిలుపునిస్తామన్నారు.

ఉచిత ఇసుక పాలసీ అమలు చేయాలి



నిడమర్రు తహసీల్దారు నాగరాజుకు వినతి పత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు



తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

నిడమర్రు: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ ఉచిత ఇసుక పాలసీ అమలు చేసి కార్మికుల ఉపాధి కల్పించాలని సీపీఎం మండల కమిటీ కన్వీనర్ నారపల్లి రమణారావు అన్నారు. శుక్రవారం నిడమర్రు తాహసీల్దారు కార్యాలయం వద్ద మండల సీపీఎం నాయకులు ఉచిత ఇసుక అమలు చేయాలంటూ కొద్ది సేపు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ కూటమి నాయకులు అధికారంలోకి వచ్చేందుకు ఉచిత ఇసుక పాలసీ అమలు చేస్తామని హామీ ఇచ్చారని, అధికారం చేపట్టాక పాలసీ ప్రకటించినా నేటికి క్షేత్రస్థాయిలో ఇసుక లేక నిర్మాణ రంగ కార్మికులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. తక్షణం ఉచిత ఇసుకను బ్లాక్ మార్కెట్‌లో కాకుండా పారదర్శకంగా సామాన్యులకు చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం నిడమర్రు తాహసీల్దారు నాగరాజుకు డిమాండ్లపై వినతిపత్రాన్ని నేతలు అందించారు. ఈ కార్యక్రమంలో గవర సత్యనారాయణ, వెలగలేటి మోహన, టెంకాయల శ్రీను, కమిలి నాని, అలగంజి శ్రీను తదితరులున్నారు.

ఉచిత ఇసుక అమలు చేయాలి

ఉంగుటూరు: ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండు చేశారు. ఈమేరకు శుక్రవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం డిప్యూటీ ఎమ్మార్వోకు వినతి పత్రం అందజేశారు. ఉచితంగా ఇసుక అందజేస్తామని ఇంతవరకు అమలుచేయక పోవడం ఏమిటని సీపీఎం సీనియర్ నాయకుడు గుత్తికొండ కృష్ణారావు ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అమలు చేయకపోవడం వల్ల భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయారని అన్నారు. ప్రభుత్వం వెంటనే భవన నిర్మాణ కార్మికలను కాపాడి కార్మికుల సంక్షేమ వెల్ఫేర్ బోర్డును అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. సీపీఎం నాయకులు నారపల్లి రమణరావు, చీరా అప్పారావు, కోట బాస్కరరావు, కె.వినోద్ ఈ ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలి

పెదపాడు: ఉచిత ఇసుక విధానం పేరుతో గతం కంటే ఇసుక ధరలు విపరీతంగా పెంచి ప్రజలపై భారం వేయడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో పెదపాడు మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ప్రజలందరికీ ఉచితంగా ఇసుక అందించాలని భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలంటూ నినాదాలు చేశారు. అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కే శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల హామీలు కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఉచిత ఇసుక విధానాన్ని తూచా తప్పకుండా అమలు చేయాలని కోరారు. విపరీతంగా పెరిగిన భవన నిర్మాణ సామగ్రి ధరలను అదుపు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఉచిత ఇసుక విధానం ప్రజలకు ఏమాత్రం అనుకూలంగా లేదన్నారు. ఇసుక అవసరమైన వారందరికీ అందుబాటులోకి తేవాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల ఉపాధిని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.సీపీఎం నాయకులు రెడ్డి లక్ష్మణరావు, షేక్ కరీముల్లా, పిట్టా రాహేలు, మసుసూరి కొండలరావు, దుర్గారావు పాల్గొన్నారు.

పాఠశాలలో కానరాని ప్రయోగాలు



పాఠశాలల్లో కాలంచెల్లిన ప్రయోగ పరికరాలు

పెదవేగి : విద్యార్థుల్లోనిని సృజనాత్మకతను, ప్రతిభను వెతికితీసి వారి ఆలోచనలను దేశానికి వినియోగించాలని చెబుతూ ప్రయోగాత్మక విద్య నందించాలన్న లక్ష్యం నీరుగారుతోంది. చిన్నారుల్లో విజ్ఞానం పెరగాలన్నా, శాస్త్ర అద్యయనంపై జిజ్ఞాస కలగాలన్నా ప్రయోగాల బోధన తప్పనిసరి, ప్రయోగశాలల్లో ప్రత్యక్ష అనుభవం ఉన్న పిల్లలకు సైన్స్ స్వభావం తెలుస్తుంది. శాస్త్ర సంబంధ విషయాలపై అవగాహన ఏర్పడుతుంది. అట్టహాసంగా జాతీయ సైన్స్ కాంగ్రెస్‌కు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు, ప్రభుత్వం, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఎంతో ఉపకరించే ప్రయోగశాలలను మాత్రం పట్టించుకోవటం లేదు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలల్లో వాటి జాడే కానరావడం లేదు. కాలం చెల్లిన పరికరాలతో బూజు పట్టి ప్రయోగాలకు అనుకూలంగా లేకుండా ఉన్నాయి. దీనికి తోడు సైన్స్ ఉపాధ్యాయుల కొరత, నిర్వహణకు నిధుల లేమి వంటి సమస్యలతో సతమతమవుతున్నా, ఉన్న వాటిని విస్మరిస్తూ ప్రయోగాల ఊసులేకుండా చేస్తున్నారు. ఫలితంగా శాస్త్రీయ విజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన లేని పరిస్థితులు దాపరిస్తున్నాయి.

దెందులూరు నియోజకవర్గంలోని 49 ఉన్నత పాఠశాల్లో ప్రయోగశాలల పరిస్థితి చూస్తుంటే అగమ్యగోచరంగా ఉంది. ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఎయిడెట్, ప్రైవేటు ఉన్నత పాఠశాలలు 49 ఉన్నాయి. వీటిలో 10 ఉన్నత పాఠశాలల్లో ఒక మోస్తరుగా అరకొర సామగ్రి ఉన్నా మిగిలిన పాఠశాలల్లో ప్రయోగశాలలు, పరికరాలు కానరావడం లేదు. సైన్స్ ప్రయోగాలపై చిన్నపాటి పరిజ్ఞానం లేకుండానే విద్యార్థులు ఇంటర్ విద్యలోకి ప్రవేశిస్తున్నారు.

కనిపించని సంచార ప్రయోగశాల

గతంలో రాజీవ్ విద్యా మిషన్ నిర్వహిస్తున్న సంచార ప్రయోగశాల విద్యార్థులకు వరంలా ఉండేది. రెండు వాహనాలు జిల్లా అంతటా తిరుగుతూ ప్రయోగాలపై విద్యార్థులకు రెండేళ్ల క్రితం అవగాహన కల్పించే వారు ప్రతి వాహనంలోను ఇద్దరు నిపుణులు ఉంటూ విద్యార్థులకు సైన్స్ విషయాలపై ప్రయోగాలు చేసి చూపుతూ పాఠ్యాంశాలపై అవగాహన కలిగించే వారు. అటువంటి సంచార ప్రయోగశాల జాడ కూడా కనిపించటం లేదు. జిల్లా నుంచి వచ్చే సంచార ప్రయోగశాల సైతం విద్యార్థుల రాకపోవటంతో వారు ప్రయోగాలకు దూరం అయ్యారు. ప్రాథమిక స్థాయిలో చిన్నారులకు శాస్త్రీయ పరిజ్ఞానం పెంచేందుకు ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నా ఫలించటంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పదో తరగతి చదివి ఇంటర్‌లోకి ప్రవేశించే విద్యార్థులకు ప్రయోగాల ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఉన్నత విద్యాశాఖ అధికారులు స్పందించిన ఉన్న పాఠశాలల్లోని ప్రయోగశాలలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

దెందులూరు ఏపీఎంగా పి.సురేష్



దెందులూరు: దెందులూరు మండల అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్‌గా పి.సురేష్ శుక్ర వారం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సురేష్ భీమడోలు ఏపీఎంగా పనిచేస్తూ దెందులూరు ఏపీఎంగా బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు దెందులూరు ఏపీఎంగా పనిచేసిన కిషోర్ జిల్లా కోఆర్డినేటర్‌గా బదిలీపై వెళ్లారు.

పెదపాడు ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

పెదపాడు: పెదపాడు ఎంపీడీవోగా అమీలు జామా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అత్తిలి మండలంలో ఎంపీడీవోగా పని చేస్తూ ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా పెదపాడు మండలానికి ఆయన వచ్చారు. ఎంపీడీవోగా ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న ఏటి రవికుమార్ నుంచి చార్జి తీసుకున్నారు. దీంతో ఆయనకు పెదపాడు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు మేకా శ్రీనివాస్, ఎం వెంకటేశ్వరరావు, పద్మారావు, వినోద్‌తో పాటు వీఆర్వోలు బెవర కోటేశ్వరావు, ఘంట ప్రభాకరరావు, కృష్ణ, మండల పరిషత్ సిబ్బంది, గ్రేడ్ 5 కార్యదర్శులు కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

దుర్గమ్మ ఆలయాల్లో వైభవంగా కుంకుమ పూజలు



ఉంగుటూరు : నవరాత్రి ఉత్సవాల్లో విద్యుత్ కాంతుల నడుమ అమ్మవారి ఆలయం



దెందులూరు: అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



దెందులూరు: గోపన్నపాలెం కనకదుర్గమ్మ ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న భక్తులు



నిడమర్రు: పెదనిండ్రకొలను రామాలయంలో అన్నపూర్ణ అలంకరణలో దుర్గాదేవి



గుండుగొలనులో బాలత్రిపుర సుందరిగా అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో గణపవరం కంచికామాక్షి కనకదుర్గ

ఉంగుటూరు: విద్యుత్ కాంతులు నడుమ దసరా ఉత్సవాలు నిర్వహించనున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయాలను ముస్తాబు చేశారు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం పూజలు నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొంటున్నారు. వెల్లమిల్లి, చిన్న వెల్లమిల్లి, బొమ్మిడి, కాకర్లమూడి, రాచూరు, రావులపర్రు, గొల్లగూడెం, యర్రమళ్ల, నాచుగుంట తదితర గ్రామాల్లో అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహిస్తున్నారు.

గోపన్నపాలెంలో దసరా ఉత్సవాలు ప్రారంభం

దెందులూరు: గోపన్నపాలెంలోని కనకదుర్గమ్మదేవి ఆలయంలో దసరా ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయని మాజీ సర్పంచ్, ఆలయ కమిటీ సభ్యుడు కొండేటి హనుమంతు, తోట రామకృష్ణ, జ్యోతిబాబు, అచ్చారావు తెలిపారు. ఈ ఉత్సవాల సందర్భంగా తొమ్మిదిరోజులపాటు అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించనున్నారు.

గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు

దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గోపన్నపాలెంలో కనకదుర్గమ్మ అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. గ్రామానికి చెందిన తోట అచ్చారావు, వెంకటేశ్వరి దంపతులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ కొండేటి హనుమంతు, తోట రామకృష్ణ ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

నిడమర్రు: శరన్నవరాత్రి ఉత్సవాలు రెండోవ రోజు వైభవంగా కొనసాగాయి. శుక్రవారం మందలపర్రు ఉమా నీలకంఠేశ్వర దేవాలయంలో అమ్మవారు గాయత్రీ అలంకరణలో, పెదనిండ్రకొలను, నిడమర్రు, బువ్వనపల్లి, పత్తేపురంలో దుర్గాదేవి గాయత్రీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల్లో కుంకుమ పూజలు నిర్వహించారు.

కనుల వేడుకగా దసరా ఉత్సవాలు

భీమడోలు: దసరా శరన్నవరాత్రి ఉత్సావాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు భక్తులకు వివిధ రూపాలల్లో దర్శనమిచ్చారు. గుండుగొలను, పూళ్ల, ఎంఎంపురం, భీమడోలు, నరెడ్లగూడెంలో అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుండుగొలనులోని భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు ఉదయం వారాహి దేవిగా, సాయంత్రం బాలాత్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పూళ్ల, ఎంఎంపురం గ్రామాల ఇలవేల్పు భవానీ మాత శ్రీగాయత్రి దేవి అవతారంలో భక్తులు దర్శించుకున్నారు. భీమడోలు పంచాయతీ శివారు నరెడ్లగూడెంలో గద్దెపై కొలువైన కనకదుర్గమ్మ గాయత్రి దేవిగా దర్శనమిచ్చారు. గుండుగొలనులోని వేంకటేశ్వర ఆలయంలో దసరా ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

దుర్గాదేవికి పూజలు

గణపవరం: గణపవరంలోని కంచికామాక్షి కనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కంకుమ పూజలు చేశారు.

వరి పంటపై మూషికాల దాడి

- చిరుపొట్ట, ఈనిక దశలో వరి పైరు
- ఎలుకల నివారణకు అధిక వ్యయం
- అప్రమత్తంగా వ్యవహరించకుంటే దిగుబడిపై ప్రభావం
- పెరుగుతున్న పెట్టుబడి వ్యయం



ఎలుక కొట్టిన వరిచేను

పెదవేగి: నాట్లు వేసినప్పటి నుంచి పంట చేతికొచ్చే వరకు రైతు ఆరుగాలం శ్రమిస్తాడు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టాలను ఎదుర్కొంటారు. అతివృష్టి, అనావృష్టి పరిస్థితులను ఎదుర్కొని కర్షకులు వ్యవసాయం చేస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో మూషికాలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ప్రస్తుతం వరి పైరు చిరుపొట్ట, ఈనిక దశ లో ఉంది. నారుమడ దశ నుంచి ఎలుకలు అన్నదాతను కలవరపెడుతున్నాయి. సామూహికంగా ఎలుకల నిర్మూలనకు ప్రభుత్వం రైతులకు ఉచితంగా బ్రోమోడ యోలిన్ మందును సరఫరా చేసింది. దీని వల్ల ఆశించిన ఫలితాలు వచ్చే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

పెరిగిన ఉధృతి

తొలకరి అనంతరం అధిక శాతం వరి కోత యంత్రాలతో నూర్చడంతో గడ్డి ఎక్కువ చేలల్లోనే వదిలి వేయడం, సీజన్లో అధిక వర్షాలు ఎలుకల సంతతిని వృద్ధి చేస్తున్నాయి. ప్రస్తుతం ఈనిక దశలో ఉన్న వరి దుబ్బు తీపి అధికంగా ఉండడంతో పైరుపై మూషికాల దాడి పెరిగింది. ప్రస్తుతం ఎలుకల నివారణ కోసం బొరియల్లో పొగపెట్టి చంపడం, బుట్టలు పెట్టడం, నివారణకు మందులను వినియోగించడంలో రైతులు నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలో ఎలుకలను పట్టుకునే వారికి గిరాకీ ఏర్పడింది. ఎలుకలు రూ.50 నుంచి రూ.70 వరకు వారు డిమాండ్ చేస్తున్నారు. పెట్టుబడి ఖర్చు అధికమవుతున్న తరుణంలో ఎలుకల నివారణ ఖర్చు రైతులకు అదనపు భారమవుతోంది. నియోజకవర్గంలో దెందులూరు, పెదవేగి, పెదపాడు, ఏలూరు మండలాల్లోని 50,000 ఎకరాల్లో వరిసాగు చేపడుతున్నారు. నియోజకవర్గంలో ఎలుకల ఉధృతి అధికంగా ఉందని రైతులు చెబుతున్నారు.

నెమ్మదిగా పనిచేస్తుంది

బ్రోమోడయోలిన్ మందు ఎలుక శరీరంపై విష ప్రభావాన్ని నెమ్మదిగా వ్యాప్తి చేస్తుంది. ఈ విధానంతో ఎరను తిన్న ఎలుకలన్నీ మృతి చెందుతాయి. చేల గట్లపై ఎలుక కన్నాలను గుర్తించి పొగబెట్టి మూసివేయడం ద్వారా కూడా ఎలుకలను చంపవచ్చు. ఎలుకల ఉధృతి అధికంగా ఉన్నప్పుడు ఎకరానికి దాదాపుగా నాలుగునుంచి ఎనిమిది బస్తాల వరకు దిగుబడి తగ్గే అవకాశం ఉంది.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

చిరుపొట్ట దశలో ఉండగా ఎలుకల దాడి అధికమవుతోంది. ఈ ఏడాది ఎలుకల ఉధృతి అధికంగా ఉన్న మాట వాస్తవమే. గతంలో ప్రభుత్వం సరఫరా చేసే ఎలుకల నివారణ కార్యక్రమం వారం, పదిరోజులు నిర్వహించేవారు. దీని వల్ల ఎలుకలను నివారించడం కష్టసాధ్యమయ్యేది. ఇప్పుడు నియోజకవర్గం అంతా ఒకే రోజు ప్రభుత్వం ద్వారా బ్రోమోడయోలిన్ మందును రైతులకు ఉచితంగా సరఫరా చేశాం. సామూహిక ఎలుకల నిర్మూలనపై రైతులకు అవగాహన కల్పించాం.

– ఎం ప్రియాంక, వ్యవసాయాధికారి, పెదవేగి